పార్టీ మారను

- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్

దొడ్ల వెంకటేశ్ గౌడ్

మియాపూర్, మార్చి 17: బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అవకాశంతో రెండు సార్లు కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు సేవలందిస్తున్నానని, కార్యకర్తలు ప్రజల నిర్ణయం మేరకు ఇదే పార్టీలోనే కొనసాగుతానని పార్టీ మారే ప్రసక్తే లేదని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో బీఆర్ఎస్‌కు చెందిన నేతలు, కార్యకర్తలు పార్టీ మారుతున్న నేపథ్యంలో డివిజన్ పార్టీ శ్రేణులతో కూలంకషంగా చర్చించినట్లు, వారి నిర్ణయమే తనకు శిరోధార్యమన్నారు. పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ సూచనతో పాటు ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావుల నేతృత్వంలో బీఆర్ఎస్‌లోనే కొనసాగేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనునిత్యం కేసీఆర్, కేటీఆర్‌లతోనే తన ప్రయాణం కొనసాగుతుందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తానని, డివిజన్‌లో తనతో నడిచే వారెవరూ పార్టీ మారేందుకు సిద్ధంగా లేరని, పుకార్లను ఎవరూ నమ్మవద్దని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

కాలనీల పురోగతికి తోడ్పాటు అందిస్తా..

కాలనీల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్/మాదాపూర్, మార్చి 17: కాలనీల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వాటిని పురోగతిలో నడిపించేందుకు తన పూర్తి స్థాయి తోడ్పాటు ఉంటుందన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యకర్గ ప్రతినిధులు ఎమ్మెల్యే గాంధీని ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనేలా చేయాలని, స్వచ్ఛత, పచ్చదనం కాలుష్యరహితం సహా ఎన్నో అంశాలలో ప్రజల చైతన్యం అవసరమని పేర్కొన్నారు. కాలనీ ప్రజలందరితో పాటు సీనియర్ సిటిజన్‌ల అభిప్రాయాలను తెలుసుకుంటూ కాలనీని అభివృద్ధి వైపు నడిపించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సాంబశివరావు, మహ్మద్ ఖాసీం, లియాకత్, ఖాసీం రాజీ, రహమాన్, అజీమ్, సయ్యద్‌బాబు, షేక్ ఖాజా, రహమాన్, అజీమ్, దస్తగిరి , సయ్యద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీతో ఆదిత్యనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తాం

ఎమ్మెల్యే గాంధీ తోడ్పాటుతో హైదర్‌నగర్ డివిజన్‌లోని ప్రతి కాలనీ, బస్తీల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని, పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయించి ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో ఆదివారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపి, అశోక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, విజయ్, భాస్కర్, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. – మియాపూర్, మార్చి 17

రహదారిపైనే వ్యర్థాల డంపింగ్

బాలానగర్, మార్చి 17: బాలానగర్‌లో రహదారులు డంపింగ్ యార్డులుగా తయారయ్యాయి. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా టు భరత్‌నగర్ రహదారి, ఫతేనగర్ శివాలయం టు బాలానగర్ రహదారిపై నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అయినా జీహెచ్ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం, వ్యర్థాలను తొలగించడం లేదని స్థానికులు, ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. అసలే పారిశ్రామికవాడ కావడం ఇక్కడ నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి తోడుగా వాహనాలను సైతం రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో మరింత ఇబ్బందిగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని సంబంధిత అధికారులు వ్యర్థాల డంపింగ్‌ను తొలగించాలని స్థానకులు డిమాండ్ చేస్తున్నారు.

బాలానగర్ టు భరత్‌నగర్ రహదారిపై డంపింగ్ చేసిన వ్యర్థాలు

పేస్ యూరాలజీ కాన్క్లేవ్-2024

కొండాపూర్, మార్చి 17: మూత్రపిండ వ్యాధుల అధునాతన చికిత్స విధానాలు, వ్యాధుల అవగాహనపై ఆదివారం మాదాపూర్‌లోని పేస్ దవాఖాన ఆధ్వర్యంలో 'పేస్ యూరాలజీ కాన్క్లేవ్-2024'ను నిర్వహించారు. ఈ సదస్సులో ముంబయి, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ ఫ్యాకల్టీ మెంబర్‌లు పాల్గొని తమ అనుభవాలు, అధునాతన చికిత్స విధానాలు, మూత్రపిండ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన అవగాహన విధానాలను వివరించారు. కిడ్నీ చికిత్సలోని వివిధ సవాళ్లకు సంబంధించి ఆయా రంగాల నిపుణులతో సలహాలు, సూచనలు అందజేశారు.

మూసాపేట వై జంక్షన్‌లో తనిఖీలు

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి అసెంబ్లీ సిగ్మెంట్‌లో ఏఆర్‌వో, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆదివారం మూసాపేట వై జంక్షన్ వద్ద ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ బృందాలు, కూకట్‌పల్లి ఏసీపీతో కలిసి పలు ప్రాంతాలను ఆమె తనిఖీ చేసి, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. – బాలానగర్, మార్చి 17

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పలువురు నృత్యకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో విశాఖపట్నం నుంచి విచ్చేసిన 'కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ' గురువులు తాళ్ళపాక సందీప్ కుమార్ తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్యరూపకంలో కళాకారులు నర్తించిన తీరు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. – కొండాపూర్, మార్చి 17

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్ 6వ ఫేజ్‌లోని విజయ కనకదుర్గ దేవాలయం వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్, మార్చి 17

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటునూ హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి, మాజీ సీఎం ఎన్‌టీఆర్‌ల చిత్ర పటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇన్‌చార్జిలు జగదీశ్వర్ గౌడ్, బండి రమేశ్, పార్టీ నేతలు వీరేందర్, షరీఫ్, నాగేశ్వర్‌రావు, సాంబశివరావు, ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు. – మియాపూర్, మార్చి 17

దుండిగల్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్ కృష్ణ తదితరులు

ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి

- పెద్దమ్మ తల్లి జాతరలో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, మార్చి 17: పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు దుండిగల్‌లో ఆదివారం జరిగిన పెద్దమ్మ తల్లి జాతర మహోత్సవ వేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం జరిగిన కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఆనంద్ కుమార్, బొరంపేట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, సీనియర్ నాయకులు చిన్నంగి వెంకటేశ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, బండారి మహేశ్, శ్రీనివాస్, పలువురు నాయకులు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- పటాన్‌చెరు నియోజకవర్గం, గడ్డపోతారం మండలం, కిష్టాయిపల్లిలో జరిగిన గాలిపోచమ్మ తల్లి జాతర మహోత్సవం, ఆలయ వార్షిక వేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో జిన్నారం ఎంపీపీ, రవిందర్‌గౌడ్, ఎంపీటీసీ జానాబాయి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి పాల్గొన్నారు.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు శంభీపూర్‌లోని కార్యాలయంలో కౌన్సిలర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

కేపీహెచ్‌బీలో పోలీస్ పికెటింగ్

బాలానగర్, మార్చి 17: ఎన్నికల నియమావళి అమలులోకి రావడం వలన కేపీహెచ్‌బీకాలనీ పోలీసులు పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆదివారం కేపీహెచ్‌కాలనీ సీఐ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రజలు పోలీసులతో సహకరించాలని సూచించారు.

సందడిగా మహిళా దినోత్సవ సంబురాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చందానగర్‌లోని సరస్వతీ విద్యా మందిర్‌లో 'ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎంవీఆర్ గ్రూపు'లు సంయుక్తంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. చందానగర్, శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలోని 40 కాలనీలకు చెందిన మహిళలు వేడుకలలో పాల్గొని సందడి చేశారు. ఇందులో భాగంగా నిర్వహించిన పలు ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. – కొండాపూర్, మార్చి 17

సూపర్ సీనియర్ సిటిజన్స్ పురస్కారాలు

అమీర్‌పేట్, మార్చి 17: సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రత్యేకత చాటుకుంటున్న 80 ఏండ్ల వయసు పై బడిన వయోధికులను 'సూపర్ సీనియర్ సిటిజన్స్' పేరుతో ఉగాది పురసారాలను మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందివ్వడం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు జేఎస్‌టి శాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలని కోరుతున్నారు. వివరాలకు 9440894873 9866520761 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

- నిజాంపేట్‌లో వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరికలు

దుండిగల్, మార్చి17: పార్టీలకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలే బలం, బలగమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఎవరిని నిలబెట్టిన అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఇందిరమ్మ కాలనీ ఫేస్-1కు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సుమారు 200 మంది ఆదివారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (కేఎస్ఆర్)ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజాంపేట్‌లోని కొలన్ శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాకప్పి హన్మంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, గంగాధర్, మధుసూదన్‌రెడ్డి, రామచందర్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో నూతనంగా చేరిన కార్యకర్తలతో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి

కరాటే నేర్చుకోవాలి

ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే ను ప్రతిఒక్కరు నేర్చుకోవాలని దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ రాముగౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్‌కు చెందిన 'న్యూ డ్రాగన్ ఫైటర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ' కి చెందిన 20 మంది చిన్నారులు ఈ నెల 11న సరూర్‌నగర్‌లో జరిగిన 2024 కరాటే పోటీల్లో పాల్గొని సత్తాచాటి, టీం చాంపియన్‌షిప్‌ను సైతం సాధించారు. అకాడమీ నిర్వహకులు, కరాటే మాస్టర్ బి.నరేశ్ తో కలిసి చిన్నారులు ఆదివారం కౌన్సిలర్ రాముగౌడ్‌ను కలిశారు. ఈ మేరకు ఆయన చిన్నారులను అభినందించారు. – దుండిగల్, మార్చి17

మాట్లాడుతున్న స్వేచ్ఛ తెలంగాణ వ్యవస్థాపకుడు వై.కిరణ్‌చంద్ర

30న 'ఏఐ డేస్-2024' కాన్ఫరెన్స్

శేరిలింగంపల్లి, మార్చి 17: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హాబ్‌గా త్వరలో హైదరాబాద్ నగరం మారనుందని స్వేచ్ఛ తెలంగాణ వ్యవస్థాపకుడు వై.కిరణ్ చంద్ర అన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ విబాగాల్లో ప్రతిష్టాత్మకమైన కాన్ఫరెన్స్ ''ఏఐ డేస్-2024''పేరిట రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మార్చి 30, 31 తేదీల్లో నగరంలోని జేఎన్‌టీయు వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 2000 మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్ నిపుణులు, విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సదస్సుతో హైదరాబాద్ నగరం ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలు పోతాయనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సాల్ మందార్ సీనియర్ సలహాదారుడు నాగేంద్ర నాథ్, ఓజోన్‌టెల్ సీఈఓ చైతన్య, స్వేచ్ఛ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో ఏఆర్ఓలతో పలు అంశాలపై చర్చిస్తున్న ఆర్ఓ పులి సైదులు

ఎన్నికల ఏర్పాట్లకు అధికారుల సన్నద్ధం

- కుత్బుల్లాపూర్‌లో క్షేత్రస్థాయి ఆర్ఓ పులి సైదులు చర్యలు

కుత్బుల్లాపూర్, మార్చి17: మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన అంశాలను, నియమ నిబంధనలను అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధం అయ్యారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఆర్ఓ పులి సైదులు నేతృత్వంలో ఏఆర్ఓలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ విభాగాల అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఆయా విభాగాలకు కేటాయించిన విధులను సకాలంలో నిర్వర్తించడంతో పాటు ఎలాంటి అవాంతరాలు, సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పలు సూచనలు చేశారు. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వెలిసిన ప్లెక్సీలు, వాల్‌రైటింగ్స్, వాల్‌స్టిక్కర్లను తొలగించారు. ఆయా రాజకీయ పార్టీలకు తెల్లరంగు వేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బాలాజీనగర్ వాసులు

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి బాలాజీనగర్ వాసులు కాంగ్రెస్‌లో చేరారని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. ఆదివారం బాలానగర్ ఎస్ఎంఆర్ క్యాపిటల్ కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో సీనియర్ నాయకులు సాదు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి కాంగ్రెస్ కాండువాలు కప్పి ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ, ప్రమీల, గీత, దివ్య, పావని, ధనలక్ష్మి, అనిత, సుధా, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, వినయ్, వేణు, లక్ష్మయ్య, రేష్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్ , మార్చి 17

సీసీ కెమెరాలతో భద్రతకు భరోసా

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు రూ.3 లక్షల సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు యువ నాయకుడు ముద్దం మల్లికార్జున్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్లీ టీచర్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఎల్లన్న, నారాయణ రావు, రమేశ్, విజయ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్, మార్చి 17

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

- కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్

మాదాపూర్, మార్చి 17: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎల్లవేలలా కృషి చేస్తానని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామృష్ణనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జగదీశ్వర్ గౌడ్ విచ్చేసి స్థానిక పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఇప్పటి వరకు 90 శాతం మౌలిక వసతుల పనులను పూర్తి చేయడం జరిగిందని, ఎన్నికలు పూర్తయిన తక్షణమే పెండింగ్‌లో ఉన్నటువంటి పనులను పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, వీరభద్రరావు, వెంకటయ్య, బాలకృష్ణ, వంశీకృష్ణ, అజయ్, వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణ, మహేందర్, శోభ, పార్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్